క్లుప్తంగా

ఒలింపియాడ్‌లో శ్రీఎలైట్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో శ్రీ ఎలైట్ స్కూల్ యాజమాన్యం

కోదాడఅర్బన్ : శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఎస్‌ఆర్‌ఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈనెల 19న నిర్వహించిన మ్యాథ్స్, సైన్స్ ఒలింపియాడ్ పోటీ పరీక్షలలో కోదాడ పట్టణానికి చెందిన శ్రీ ఎలైట్ పాఠశాల విద్యార్థులు 12 మంది తమ ప్రతిభను చాటుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.నరేష్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు పూజశ్రీ, నవ్యశ్రీ, నందిని, వర్షిని, సుదీక్ష, ఇమ్రాన్, లిఖిల్‌ప్రీతీష్, అప్సతబ్‌సెప్మ్, కోమల్‌సాయిమణికంఠ, చార్వి, అక్షయలను మంగళవారం పాఠశాలలో అభినందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ వేదాంతరావు, పాఠశాల ఇన్‌చార్జ్ సీతాలక్ష్మి, దుర్గాప్రసాద్, గోదాదేవి, గంగ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణానికి సర్వే

నడిగూడెం : మండలంలోని రత్నవరం వద్ద ఉన్న పాతకాలం నాటి కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని గతంలో సాక్షి పత్రికలో పలుమార్లు కథనం ప్రచురించడంతో రోడ్లు, భవనాల శాఖ అధికారులు స్పందించారు. మంగళవారం అధికారులు కల్వర్టును పరిశీలించి, ప్రతిపాదనల కోసం సర్వే చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధికారి సురేష్ నాయుడు, రత్నవరం మాజీ సర్పంచ్ పగడాల పద్మ, ప్రభాకర్‌రెడ్డి, మొలుగూరి నర్సయ్య, పోలంపల్లి వెంకటేశ్వర్లు, వెంకన్న తదితరులు ఉన్నారు.

పొలాలకు నీరందించాలని మంత్రి ఉత్తమ్‌కు విజ్ఞప్తి

మేళ్లచెరువు : మండలంలోని రేవూరు గ్రామంలో లిఫ్టు మోటారుకు మరమ్మతులు చేయించి ఎండిపోతున్న తమ పొలాలకు నీటిని అందించాలని మంగళవారం ఆ గ్రామ రైతులు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి కోరారు. మంత్రి వెంటనే సంబంధిత అధికారులను పిలిచి లిఫ్టుకు మరమ్మతులు చేయించి రేవూరు కాలువకు నీరు అందించేలా చూడాలని ఆదేశించినట్లు రైతులు తెలిపారు. తమ పంటలు ఎండిపోకుండా సత్వర చర్యలు తీసుకోవడం పట్ల రైతులు మంత్రి ఉత్తమ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంజే ఫౌండేషన్ సేవలు అభినందనీయం



ఆర్థికసాయం అందజేస్తున్న కౌన్సిలర్ సంపత్‌రెడ్డి, ఎంజే ఫౌండేషన్ సభ్యులు

హుజూర్‌నగర్ : పేదలకు ఎంజే ఫౌండేషన్ సేవలు అభినందనీయమని కౌన్సిలర్ కోతి సంపత్ రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్ పట్టణంలోని 3వ వార్డులో గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న రిక్షా కూలి ఉతెర్ల యాదగిరికి ఎంజే ఫౌండేషన్ ద్వారా (ఏడాదికి రూ.18 వేలు) నెలకు రూ.1,500 చొప్పున అందించే ఆర్థిక సహాయాన్ని మంగళవారం బాధితుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

క్రైస్తవుల నిరసన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

నడిగూడెం : చేవెళ్ల నియోజకవర్గంలోని జవ్వాడ గ్రామంలో క్రైస్తవులపై దుండగులు చేసిన దాడికి నిరసనగా మంగళవారం మండల పాస్టర్స్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ల సంఘం మండల అధ్యక్షుడు కాసాని యేసురత్నం మాట్లాడుతూ క్రైస్తవులపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాన్‌వెస్లీ, రాజు, తిమోతి, మనోజ్, జాన్, మార్కు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రంలో జెడ్పీటీసీ పేరు ముద్రించడం హాస్యాస్పదం

మునగాల : మండలంలోని శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ ముద్రించిన కరపత్రంలో మునగాల జెడ్పీటీసీ నల్లపాటి ప్రమీల పేరును ముద్రించడం సబబు కాదని సీపీఎం నుంచి జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసిన దేశిరెడ్డి జ్యోతి ఒక ప్రకటనలో మంగళవారం ఖండించారు. 2018లో నల్లపాటి ప్రమీల నామినేషన్ తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించి జెడ్పీటీసీగా గెలిచారని, ఈ విషయమై 2019లో హుజూర్‌నగర్ కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. దీంతో కోర్టు ప్రమీల ఎన్నిక చెల్లదని ఈనెల 5న తీర్పు వెలువరించిందన్నారు. అయినా ప్రమీలను జెడ్పీటీసీగా కరపత్రంలో ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తక్షణమే ప్రమీల పేరును తొలగించాలని లేకుండే తాను తీసుకునే చర్యలకు కమిటీ బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

శిథిలావస్థలో పాఠశాల భవనం



శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాల భవనం



బీటలు వారిన పాఠశాల గోడలు

- పెచ్చులూడుతున్న స్లాబ్ పైకప్పు
- భయందోళన చెందుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు
- నూతన భవనం నిర్మించాలని వేడుకోలు

గరిడేపల్లి : మండల పరిధిలోని కాల్వపల్లి గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. గోడలు బీటలు వారాయి. భవనం స్లాబ్ పెచ్చులూడుతూ వర్షం వస్తే పైకప్పు నుంచి నీరు కారుతోంది. వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు సదుపాయం లేకపోవడంతో నీరంతా స్కూల్ ఆవరణలో నిలిచిపోతోంది. దీనికి తోడు సగానికి పైగా ప్రహరీ కూడా లేకపోవడంతో పశువులు, కుక్కలు పాఠశాల ఆవరణలో సంచరిస్తున్నాయి. దీంతో భవనం ఎప్పుడు కూలుతుందోనని ఉపాధ్యాయులు, విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు.

పురాతన భవనంలోనే తరగతులు..

కాగా, పురాతన భవనంలోనే 1 నుంచి 5వ తరగతులు నిర్వహిస్తున్నారు. ఉన్న ఒక్క కొత్త భవనంలో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగిస్తున్నారు. పాత భవనంలోనే ఒక గది ప్రధానోపాధ్యాయులు కార్యాలయానికి వాడుకుంటున్నారు. ఈ పాఠశాలలో సుమారు 25 మంది పేద విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఏ క్షణాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని తెలియక విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యాభివృద్ధికి కోట్లాది రూపాయాలు ఖర్చు చేస్తున్నామని పాలకులు గొప్పలు చెబుతున్నా కాల్వపల్లి పాఠశాలను మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ పాఠశాలకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



కాల్వపల్లి పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు నిర్వహిస్తున్నాం. పాఠశాల శిథిలావస్థకు చేరింది. నూతన తరగతి గదుల నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే కొత్త గదులు నిర్మిస్తాం. త్వరలోనే నిధులు మంజూరు అవుతాయని ఆశిస్తున్నాం.

– ఎంఈఓ చత్రునాయక్

జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ఎజెండా



తుంగతుర్తిలో మాట్లాడుతున్న విరాహత్‌అలీ

తుంగతుర్తి : జర్నలిస్టుల సంక్షేమం కోసం టీయూడబ్ల్యూజే–ఐజేయూ యూనియన్ అవిశ్రాంత కృషి చేస్తూ, జర్నలిస్టుల హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటం నిర్వహిస్తోందని టీయూడబ్ల్యూజే–ఐజేయూ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సిరి ఫంక్షన్ హాల్లో టీయూడబ్ల్యూజే–ఐజేయూ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరమంచి రవీందర్ శర్మ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా తృతీయ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జర్నలిస్టుల హక్కుల కోసం ప్రభుత్వంతో పోరాటం చేసి హక్కులను సాధించుకున్న ఘనత ఒక్క టీయూడబ్ల్యూజే–ఐజేయూకు మాత్రమే దక్కిందన్నారు. జర్నలిస్టులు ముఖ్యంగా ఇళ్ల స్థలాలు, ఇళ్లు కోరుకుంటున్నారని.. ఈ విషయం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, సమాచార శాఖ మంత్రిని కలిసి జర్నలిస్టుల సమస్యలను ప్రస్తావించినట్లు తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గుజ్జ దీపికయుగంధర్‌రావు మాట్లాడారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సేవలు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు కొంజేటి సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చలసాని సత్యనారాయణ, నేషనల్ కౌన్సిల్ మెంబర్ మిక్కిలినేని శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి బంటు కృష్ణ, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు అప్పిరెడ్డి, గోపాలకృష్ణ, మల్లికార్జున్, మల్లారెడ్డి, రాంరెడ్డి, కందుకూరి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి తెలుగు రాష్ట్రాల స్థాయి కోలాట పోటీలు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో గల స్వయంభు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి తిరు కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయం ఆవరణలో ఈనెల 22 నుంచి 24 వరకు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి కోలాట పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే కళాకారులు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.25 వేల నగదు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు, తృతీయ బహుమతి రూ.18వేలు, చతుర్థ బహుమతి రూ.15 వేలు, పంచమ బహుమతి రూ.12వేలు, ఆరవ బహుమతి రూ.పదివేలు, ఏడవ బహుమతి రూ.8వేలు, ఏనిమిదవ బహుమతి రూ.ఆరువేలు నగదు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనదలచిన కళాకారులు 9010767415, 9700426132, 9705100540 నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని కోలాట కళాకారులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

ఏసీపీ అమరగాని కృష్ణయ్యకు సన్మానం



ఏసీపీ కృష్ణయ్యను సన్మానిస్తున్న బీసీ విద్యార్థి సంఘం నాయకులు

మునగాల : మండలంలోని కలకోవ గ్రామానికి చెందిన పోలీసు ఉన్నతాధికారి అమరగాని కృష్ణయ్య హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ ఏసీపీగా పదోన్నతి పొందడంతో మంగళవారం బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లోని ఆయన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆకుపాముల గ్రామానికి చెందిన బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్‌గౌడ్ మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన కృష్ణయ్య పోలీసు శాఖలో అంచెలంచెలుగా ఎదుగుతూ నేడు ఏసీపీగా బాధ్యతలు చేపట్టడం మండలానికే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు భాష్యం వంశీయాదవ్, బడేటి వంశీయాదవ్, హృతిక్, జిల్లా నాయకులు దొంతగాని నాగేశ్వరరావు, పోలంపల్లి మణికంఠ, శ్రీరామ్ హేమంత్, నిమ్మల నాగరాజు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

మోతె : మండలంలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డు గ్రామంలో మంగళవారం జనావాసాల మధ్య కరెంట్ తీగ తెగిపడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. లోఓల్టేజీ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి విద్యుత్ వైర్ తెగిపడిందని స్థానికులు తెలిపారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో తక్షణమే కొత్త ట్రాన్స్‌ఫార్మర్, వైర్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కొమ్ముబండాతండాలో రేపు బొడ్రాయి ప్రతిష్ఠ



పుట్టమన్ను తీసుకెళ్తున్న తండావాసులు

చిలుకూరు : మండలంలోని కొమ్ముబండతండా గ్రామంలో ఈ నెల 22వ తేదీన శ్రీ శీతల పరమేశ్వరి (బొడ్రాయి) ప్రతిష్ఠాపనోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం తండావాసులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. మహిళలు, గ్రామపెద్దలు డప్పు చప్పుళ్లతో వెళ్లి పుట్టమన్నును బొడ్రాయి ప్రతిష్ఠించే ప్రదేశానికి తీసుకొచ్చారు. కాగా, బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బొడ్రాయి నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కోరారు.

జిల్లా సదస్సును జయప్రదం చేయాలి



కోదాడరూరల్ : సదస్సు కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోదాడరూరల్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 27న జరిగే మాదిగ ఉపకులాల జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నారకట్ల ప్రసాద్‌మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం కోదాడ మండలంలోని దోరకుంటలో జిల్లా సదస్సు కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించే వరకు జరిగే పోరాటల్లో పాల్గొనేందుకు మాదిగలు సిద్ధం కావాలన్నారు. సదస్సుకు జిల్లాలోని మాదిగ, మాదిగ ఉపకులాల విద్యావంతులు, ఉద్యోగులు, యువత హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో బొల్లెపోగు స్వామి, మరియదాసు, అనిల్, బ్రహ్మం, మహేష్, శోభన్ ఉన్నారు.

సదస్సు కరపత్రం ఆవిష్కరణ

హుజూర్‌నగర్ : ఈనెల 27న సూర్యాపేటలో నిర్వహించబోయే మాదిగ ఉపకులాల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో జిల్లా సదస్సు కరపత్రాలను ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.రాము, ముక్కంటి, రవి, రాము, సైదులు, క్రాంతి, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర



హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

మునగాల : మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర హనుమాన్ దేవాలయం 64వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నుంచి 72 గంటల అఖండ హరేరామనామ సంకీర్తన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు హనుమాన్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. శోభాయాత్రలో భాగంగా హనుమాన్ విగ్రహానికి భక్తులు హారతినిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తూముల వీరస్వామి, ప్రధాన కార్యదర్శి గంధం అంజయ్య, కమిటీ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు బొర్రా కృష్ణమాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో దెబ్బతిన్న వరిపంటల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

చిలుకూరు : నకిలీ వరి విత్తనాలు విక్రయించి పంట నష్టానికి కారణమైన కంపెనీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ చిలుకూరుకు చెందిన పలువురు రైతులు ఇటీవల మండల వ్యవసాయాధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శ్రీధర్, చంద్రశేఖర్ మండల వ్యవసాయాధికారులతో కలిసి నకిలీ విత్తనాలతో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. నాటు వేసిన నెల రోజుల లోపే వరిపంట ఈత దశకు వచ్చి పొలాలు మొత్తం దెబ్బతిన్నాయని ఆవేదన వారి ఎదుట వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎకరం పొలానికి రూ.15వేలకు పైగా పెట్టుబడులు పెట్టామని, కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని వాపోయారు. తమకు వరివిత్తనాలు విక్రయించిన చరణ్ సీడ్స్ కంపెనీకి చెందిన సన్నరకం చరణ్ సోనామ్ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు తమకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పంటలను పరిశీలించిన వారిలో మండల వ్యవసాయాధికారి శ్రీధర్, ఏఈఓ శిరీష, రైతులు మండవ వెంకటేశ్వర్లు, మరీదు శ్రీను, అమరగాని లింగరాజు, పలువురు రైతులు ఉన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు

మోతె : విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికావద్దని మోతె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నాజియ అన్నారు. మంగళవారం మోతె మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో విద్యార్థులకు మానసిక ఉల్లాసం, ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది కమల, సుచరిత, శ్రీదేవి, పలువురు టీచర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని అమరవరం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శ్రీనివాసపురం, అమరవరం, సీతారాంపురం, యాతవాకిళ్ల, హనుమంతులగూడెం గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ రాంప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో..

నేరేడుచర్ల : మండలంలోని తెలగరామయ్య గూడెంలో గల 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మరమ్మతులు చేపడుతున్న కారణంగా సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ ఏఈ పందిరి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వరి పంటకు నీరందించి కాపాడాలి

గరిడేపల్లి : మండలంలో బోర్లు, బావుల కింద సాగు చేసిన వరి పొలాలు నీరందక ఎండిపోతున్నాయని, ప్రభుత్వం ఎడమ కాలువ ద్వారా నీరందించి కాపాడాని సీపీఎం మండల కార్యదర్శి యాకూబ్ కోరారు. మంగళవారం మండలంలోని సుభాష్‌నగర్, లక్ష్మీపురం గ్రామాల్లో ఎండిపోయిన వరి పొలాలను రైతు బృందంతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేశారని, ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటడంతో సాగు నీరు అందక దిక్కుతోచని స్థితిలో ఉన్నారని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చొరవ చూపి 15రోజులు ఎడమ కాలువకు నీరు వదిలి పొలాలకు నీరిచ్చి కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరస్వామి, నంద్యాల పిచ్చిరెడ్డి, కృష్ణారెడ్డి, చింతల సీతారాములు, వీరనరసింహ, నాగరాజు, మహేష్, సైదిరెడ్డి, ఎస్‌కె యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మ

మేళ్లచెరువు : వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని ఎంపీపీ కొట్టె పద్మ సైదేశ్వరరావు కోరారు. మంగళవారం మేళ్లచెరువు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. గ్రామాల్లో నెలకొన్న విద్యుత్, తాగునీరు, రోడ్ల సమస్యలను సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని, మిషన్ భగీరథ నీళ్లు ప్రతి ఇంటికీ చేరేలా చూడడంతో పాటు ట్యాంకులు శుభ్రంగా ఉంచాలని కోరారు. పైపుల లీకేజీలకు మరమ్మతులు చేసి నీటి సమస్య లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అజహర్‌అలీ, జెడ్పీటీసీ పద్మ, వైస్ ఎంపీపీ గాయం గోపిరెడ్డి, ఏపీఎం శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్‌గౌడ్, ఏపీఓ శైలజ, ఎంఈఓ సైదానాయక్, పశువైద్యాధికారి ఉషారాణి, మండల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్, ఆర్‌ఐ వాసు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం



స్వామివారికి పల్లకీసేవ నిర్వహిస్తున్న పూజారులు, భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నమ్మాళ్వారుల అధ్యయనోత్సవాలతో ఆగమ శాస్త్ర రీతిలో వైభవంగా ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా స్వయంభు వేణుగోపాలస్వామి వారిని సుప్రభాతంతో మేల్కొల్పి నిత్యవిధి కైంకర్యాలను నిర్వహించారు. ప్రధానాలయ మండపంలో ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు, తులసి మాలలతో దివ్య మనోహరంగా అలంకరించారు. అలంకార సేవ, ఆళ్వారుల సేవోత్సవాలలో దివ్యప్రబంధ వేద పఠనం చేశారు. రాత్రి మంగళవాయిద్యాల నడుమ పల్లకీ సేవ నేత్రపర్వంగా సాగింది. కార్యక్రమాల్లో ఆలయ ఈఓ, స్థానాచార్యులు, అర్చకులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా



ఆలయ నూతన చైర్మన్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ భూక్యా గోపాల్

పాలకవీడు : మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామంలో గల శ్రీ సీతారామాంజనేయ, పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎంపీపీ భూక్యా గోపాల్ అన్నారు. మంగళవారం ఆలయ నూతన కమిటీ చైర్మన్‌గా వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా శ్రీకాకుల సైదాచారి, కార్యవర్గ సభ్యులను గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్‌ను ఎంపీపీ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యవర్గ సభ్యులు కిష్టిపాటి వెంకట్‌రెడ్డి, సారెడ్డి లచ్చిరెడ్డి, సారెడ్డి సీతారాంరెడ్డి, కిష్టిపాటి అంజిరెడ్డి, ఆదిరెడ్డి రాఘవరెడ్డి, పుట్టూరి నర్సిరెడ్డి, దిద్దకుంట్ల నర్సిరెడ్డి, పుట్టూరి చిన కోటిరెడ్డి, కృష్ణారెడ్డి, దిద్దకుంట్ల వెంకట్‌రెడ్డి, నంద్యాల రంగారెడ్డి, షేరు నరేందర్‌రెడ్డి, బోగాల చంద్రశేఖర్‌రెడ్డి, కిష్టిపాటి శ్యాంసుందర్‌రెడ్డి, దిద్దకుంట్ల పురుషోత్తంరెడ్డి, వరగాని సత్యనారాయణ, కొత్త ప్రసాద్, గుండ్ర సత్యనారాయణరెడ్డి, మునగాల భాస్కర్‌రెడ్డి, సాముల ఉపేందర్‌రెడ్డి, బట్టు వెంకటేశం, దొంగల వెంకటయ్య, పాతకోటి శ్రీను, ఉయ్యాల దుర్గయ్య, వెంకటాచారి గ్రామస్తులు పాల్గొన్నారు.

టెన్త్ ఇంటర్నల్ మార్కుల పరిశీలన



విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల రికార్డులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయ బృందం

నేరేడుచర్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 10వ తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల రికార్డులను ఇంటర్నల్ మార్కుల పరిశీలన అధికారి ఎం. బాలు నేతృత్వంలో ఉపాధ్యాయుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థుల రాత పుస్తకాలు, రికార్డులు, స్లీఫ్ టెస్ట్‌లతో పాటు వివిధ రకాల నోట్స్‌లను పరిశీలించి మార్కులను నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, ఉపాధ్యాయ బృందం నర్సకుమారి, పద్మావతి, సైదులు, వెంకటేశ్వర్‌రావు, ప్రభాకర్ రెడ్డి, నర్సింహారావు, భవాని, స్రవంతి, అన్నపూర్ణ, కల్యాణి, శ్రీనివాస్‌రావు, రవి, కృష్ణప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సమ్మేళనాలతో స్నేహపూర్వక వాతావరణం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంఎస్ కళాశాల చైర్మన్ నాగిరెడ్డి

కోదాడఅర్బన్ : ఆత్మీయ సమ్మేళనాలతో విద్యార్థుల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని ఎంఎస్ విద్యాసంస్థల చైర్మన్ పందిరి నాగిరెడ్డి అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని ఎంఎస్ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల సీఈఓ ఎస్ఎస్‌రావుతో కలిసి ఆయన సరస్వతి విగ్రహానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాగా, విద్యార్థుల నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల ప్రిన్సిపాల్ తోట రంగారావు, అధ్యాపకులు గంగాధర్, వీరస్వామి, సునీ, మమత, నాగార్జున, పాషా, శ్రీనివాస్ విజయభాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



కోదాడరూరల్ : కూచిపూడిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం మాజీ ఎంపీపీ కటికం ఆశరమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కటికం లక్ష్మీనారాయణ, కటకం గోపయ్య, బత్తిని రాంబాబు, నేలపట్ల వెంకటేశ్వర్లు, నక్క వెంకన్న, సోమగాని వెంకన్న, మచ్చ కృష్ణ, రేఖ వీరశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుకుంటాం

కోదాడరూరల్ : కోదాడ మండలంలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేసుకొని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుకుంటామని ఎంపీపీ మల్లెల రాణిబ్రహ్మయ్య, జెడ్పీటీసీ మండలపు కృష్ణకుమారి అన్నారు. మంగళవారం మండలంలోని కూచిపూడిలో ఉపాధి హామీ నిధులు రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేసి మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే పద్మావతి సహకారంతో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్ రెడ్డి, రెడ్డిపూడి అనంతరామయ్య, శెట్టి విజయ్‌భాస్కర్‌రావు, చాప తిరపతయ్య, లక్ష్మయ్య, కార్యదర్శి నాగలక్ష్మి, పూర్ణచందర్‌రావు, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

కులగణన తీర్మాన ఆమోదంపై హర్షం

హుజూర్‌నగర్ : తెలంగాణలో బీసీ కులగణనపై రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ విన్నపం ఒక పోరాటం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం హుజూర్‌నగర్ టౌన్ హాల్‌లో జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు చీకూరి లీలావతి, తన్నీరు మల్లికార్జున్, కిషోర్, గోవిందరావు, దీప, పి.బాబు, రామ్మూర్తి, యలమంద, రవి, క్రాంతికుమార్, సందీప్, రవి, సరస్వతి, లక్ష్మి, సుధా, కృష్ణ, శ్రీలత, పద్మ తదితరులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

క్షేత్రపాలకుడికి ఆకుపూజ

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీశాల్మలీకంద ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో క్షేత్రపాలకుడికి మంగళవారం ఘనంగా ఆకుపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, ఈఓ ఎంపి లక్ష్మణరావు, అర్చకులు హరీష్‌కుమార్‌చార్యులు, మనోహరాచార్యులు, సి బ్బంది, కిరణ్‌గౌడ్, గోవిందరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఉన్న శ్రీఅభయాంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. దాతలు తెడ్ల జయశంకర్, స్వాతి, పెనుగొండ వెంకటేశ్వర్లు, కస్తూరి బొడ్ల ఫణీంద్ర, సౌందర్య, నీలీష్, రాంబాబు, జూకూరి అంజయ్య, దేవరశెట్టి హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.